AKSHARA TODAY

అక్షర రటుడే


TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

భక్తితో 'అమ్మ'ను కొలుస్తూ..



2



2

నలుగురు హోంగార్డుల సస్పెన్షన్

డీజిల్ లేక నిలిచిన జీపీ ట్రాక్టర్



గాంధారి మండలంలోని గుర్జల్ గ్రామంలో గ్రామపంచాయతీ ట్రాక్టర్ మంగళవారం రోడ్డుమధ్యలోనే నిలిచిపోయింది. ట్రాక్టర్‌లో డీజిల్ లేక నిలిచిపోవడంతో గ్రామస్తులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. పారిశుధ్య నిర్వహణలో అత్యంత అవసరమైన ట్రాక్టర్‌ను జీపీ పాలకులు పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ట్రాక్టర్ రోడ్డుపై నిలిచిపోవడంతో అందులోని చెత్త గాలికి రోడ్డంతా వ్యాపించింది. దాదాపు రెండు గంటల తర్వాత డీజిల్ తెప్పించి ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తరలించారు. – అక్షరటుడే గాంధారి

13-10-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2



భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: భూముల రీసర్వే నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ.. రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధికారులను ఆదేశించారు. మెండోరా మండలం వెల్గటూర్‌లో మంగళవారం నిర్వహించిన గ్రామసభలో అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వే జరిపిస్తోందని అన్నారు. రీసర్వేతో భూముల సరిహద్దు సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. అయితే సర్వే చేసే ముందు సంబంధిత రైతులకు తప్పనిసరిగా సమాచారం ఇచ్చి వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. గ్రామసభలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభం

అక్షరటుడే, కామారెడ్డి : కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి మంగళవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు కలగకుండా రహదారి సౌకర్యాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మోతిలాల్, డీఈ హన్మంత్ రావ్, టీపీవో వినీత్, గూడెం శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



భూ భారతి రీ సర్వే పరిశీలన

అక్షరటుడే, ఆర్మూర్ : జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్ గ్రామంలో జరుగుతున్న భూ భారతి రీ సర్వేను ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్వాన్ మాల్వియా మంగళవారం పరిశీలించారు. గ్రామంలో సర్వే బృందాలు చేస్తున్న పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సర్వే పనులను త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట జక్రాన్‌పల్లి తహశీల్దార్ కిరణ్మయి, మునిపల్లి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుష్కరాల పనులను గడువులోపు పూర్తి చేయాలి : కలెక్టర్

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: గోదావరి పుష్కరాల పనులను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్నిరకాల మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే ఏడాది జూన్, జూలై మాసాల్లో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం పుష్కర క్షేత్రాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని కలెక్టర్ అన్నారు. కందకుర్తి వద్ద గల పుష్కర ఘాట్ తో పాటు, నవీపేట మండలం యంచ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న పుష్కర ఘాట్లను ఆమె పరిశీలించారు. కందకుర్తి వద్ద దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం కారణంగా ఇరిగేషన్ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనుల విషయంలో కొంత జాప్యం జరుగుతోందని సంబంధిత అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. నీటి ప్రవాహం తగ్గిన వెంటనే పనులను వేగవంతంగా చేపట్టి, మార్చి నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. యంచ వద్ద చేపట్టనున్న పుష్కర ఘాట్, పార్కింగ్ ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. భక్తులకు రవాణా వసతి, పార్కింగ్, టాయిలెట్స్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. అదనపు కలెక్టర్ భుజంగరావు, బోధన్ ఆర్డీవో విజయ కుమారి, తహశీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ ఉన్నారు.



ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. వర్షా లు లేక, కరెంట్ కోతలతో పొలాలకు నీరు అందడం లేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే.. అప్పులే మిగిలేలా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కరెంట్ ఎప్పుడు వస్తే అప్పుడు పొలాలకు పరుగులు తీస్తున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

అయ్యో.. రైతన్న..

- నీరందక ఎండిపోతున్న పంటలు
- కరెంట్ కోతలతో అన్నదాతలు ఆగం
- విద్యుత్ అధికారులపై ఆగ్రహం
- ధర్నాలు చేస్తున్న పట్టించుకోని వైనం

కామారెడ్డి జిల్లాలో సాగు నీరందక పంటలు ఎండుతున్నాయి. ప్రస్తుతం పంటలు ఈనిక, పొట్ట దశలో ఉన్నాయి. ఈ సమయంలో పంటలకు నీరు చాలా అవసరం. నీళ్లుపారితే తప్ప పంట బతికే అవకాశం లేని సమయంలో త్రీఫేస్ కరెంట్ అన్నదాతలను ఆగం చేస్తోంది. సరిపడా విద్యుత్ సరఫరా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

జిల్లాలో పంటల సాగు వివరాలు

కామారెడ్డి జిల్లాలో సాగు పూర్తిగా బోరుబావులపై ఆధారపడి ఉంది. జిల్లాలో మొత్తం 5 లక్షల ఎకరాలకు పైగా సాగుభూమి ఉండగా, ప్రస్తుత వానాకాలంలో పంటల సాగు వివరాలు ఇలా ఉన్నాయి. వరి పంట 3,14,251 ఎకరాలు, సోయాబీన్ 87,736 ఎకరాలు, కంది 48,315 ఎకరాల్లో సాగవుతోంది. అలాగే మొక్కజొన్న 47,237 ఎకరాలు, పత్తి 45,864 ఎకరాలు, పెసర 2,198 ఎకరాలు, మినుము 1,851 ఎకరాలు, చెరకు 573 ఎకరాలు సాగవుతున్నాయి. ఇంత భారీ విస్తీర్ణంలో పంటలు సాగవుతున్న తరుణంలో కరెంట్ కోతలు పడటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సకాలంలో విద్యుత్ సరఫరా చేయకపోతే జిల్లాలో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి.

ఎండిపోతున్న పంటలు

జిల్లాలో ప్రస్తుతం వరి, సోయా, పత్తి, మొక్కజొన్న పంటలు కీలకమైన ఎదుగుదల దశలో ఉన్నాయి. ఈ సమయంలో నీరు అందకపోతే పంట పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉంది. గత 10రోజులుగా మూడు ఫేజుల కరెంట్ 5 నుంచి 7 గంటలు మాత్రమే ఇస్తున్నారని, అది కూడా తక్కువ వోల్టేజీతో వస్తుండటంతో బోర్లు నీరు పోయడం లేదని రైతులు వాపోతున్నారు. రోజూ రాత్రి వేళల్లో కరెంట్ ఇస్తుండటంతో పొలాల వద్దకు వెళ్లాలంటేనే భయమేస్తోందని అంటున్నారు. పాము కాటు, తేలు కాటు భయంతో రాత్రి మోటార్లు ఆన్ చేయలేకపోతున్నామని, దీంతో రూ.వేలల్లో ఖర్చు చేసిన వేసిన పంటలు నీళ్లు లేక ఎండిపోతున్నాయని కన్నీరు పెడుతున్నారు. బీబీపేట, రాజంపేట, సదాశివనగర్, గాంధారి, బాన్సువాడ మండలాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని రైతులు చెబుతున్నారు.

కరెంటు కోసం రోడ్డెక్కుతున్న వైనం..

విద్యుత్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో రైతులు చివరికి రోడ్డెక్కక తప్పలేదు. మంగళవారం పలు మండల కేంద్రాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్లను రైతులు ముట్టడించారు. ప్రధాన రహదారులపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బుధవారం పాల్వంచ, లింగంపేట మండలాల్లో రైతన్నలు రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. ఎన్నికల ముందు 24 గంటల నాణ్యమైన కరెంట్ అన్నారు. ఇప్పుడు 3 గంటలు కూడా సరిగా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలు ఎండిపోతుంటే అధికారులు ఏసీ గదుల్లో కూర్చొని పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు.

విద్యుత్ అధికారులపై ఆగ్రహం

కరెంట్ కోతలపై రైతులు విద్యుత్ శాఖ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో మరమ్మతులు చేయకపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా పట్టించుకోకపోవడంతోనే ఈ సమస్య వస్తోందని ఆరోపిస్తున్నారు. లైన్లపై చెట్ల కొమ్మలు పడినా తొలగించడం లేదని అంటున్నారు. వెంటనే వ్యవసాయానికి రోజుకు కనీసం 9 గంటల పాటు పగటిపూట నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు.

దసరా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: దసరా పండుగ సందర్భంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజామాబాద్ టౌన్ 1 సీఐ బి. శ్రీనివాస్ సూచించారు. పండుగ సమయంలో విలువైన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అవసరానికి మించి ఆభరణాలను ధరించి రద్దీగా ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. కుటుంబ సమేతంగా ఊరికి వెళ్లే టప్పుడు ఇంటి తలుపులు, కిటికీలు సక్రమంగా మూసి తాళాలు వేయాలని.. ఇంట్లో నగదు, బంగారం వంటి విలువైన వస్తువులను ఉంచకూడదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రద్దీ ప్రాంతాల్లో పిల్లలు తప్పిపోకుండా అప్రమత్తంగా చూసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో ప్రభావంతో పెరిగిన విద్యుత్ డిమాండ్



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎల్‌నినో ప్రభావం, లోటు వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా నిజామాబాద్ సర్కిల్ పరిధిలో విద్యుత్ వినియోగం సాధారణ పరిస్థితుల కంటే ఎక్కువగా ఉందని టీజీఎన్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజనీర్ పి.వి. రాజేశ్వర్ రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 2025తో పోలిస్తే 2026 జూలై, ఆగస్టులలో విద్యుత్ వినియోగం 3.53శాతం పెరగగా, సెప్టెంబర్‌లో 53.83శాతం, అక్టోబర్ 1-12 మధ్య ఏకంగా 68.01శాతానికి పైగా పెరిగింది. సెప్టెంబర్‌లో గరిష్ఠ డిమాండ్ 767 మెగావాట్లకు చేరింది. అక్టోబర్‌లో రోజువారీ వినియోగం గత ఏడాదితో (6.38 మిలియన్ యూనిట్లు) పోలిస్తే 11.25 మిలియన్ యూనిట్లకు పెరిగింది. ఆయా డివిజన్, సర్కిల్, కార్పొరేట్ స్థాయిల్లో నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, నోడల్ అధికారులను నియమించామని ఎస్ఈ తెలిపారు. వచ్చే వేసవి డిమాండ్‌ను తట్టుకోవడానికి ముందస్తుగా 4 కొత్త సబ్‌స్టేషన్లు, 10 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 468 డిటీఆర్‌లు, 28 కెపాసిటర్ బ్యాంకులు, కొత్త ఫీడర్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఎస్ఈ తెలిపారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి : రాజేష్ చంద్ర



అక్షరటుడే, కామారెడ్డి: కేసుల దర్యాప్తులో నాణ్యత, కచ్చితత్వం పాటించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం పలు పోలీస్‌స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న రైటర్లకు కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైటర్లతో మాట్లాడి శిక్షణలో నేర్చుకున్న అంశాలు, కేసుల నమోదు, దర్యాప్తు ప్రక్రియలపై వారికి కలిగిన అవగాహనను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. నేర్చుకున్న విషయాలను విధి నిర్వహణలో ఆచరణలో పెట్టాలని సూచించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటి నుంచి చార్జిషీట్ దాఖలు చేసే వరకు కేసుకు సంబంధించిన ప్రతి అంశాన్ని సమగ్రంగా, స్పష్టంగా, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని ఆదేశించారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను వాస్తవాల ఆధారంగా నమోదు చేయాలని, సాక్ష్యాధారాల సేకరణ, భద్రపరచడం, కేసు వివరాల నమోదులో ప్రతి దశలో అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. ఆధునిక పోలీసింగ్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, విధి నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించి పోలీసు శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సీఐ రాజారెడ్డి, ఇతర పోలీసు అధికారులు, జిల్లాలోని పోలీస్ స్టేషన్లు, సీఐ, డీఎస్పీ కార్యాలయాల రైటర్లు పాల్గొన్నారు.



నగరంలో అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం : ధన్‌పాల్

అక్షరటుడే, ఇందూరు: అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. నగరంలోని 50, 7, 20వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన కార్పొరేషన్ కౌన్సిల్‌లో ప్రతి డివిజన్‌కు రూ.20లక్షల నిధులు కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో అన్ని డివిజన్లో అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తామని తెలిపారు. అర్బన్ చాలెంజ్ ఫండ్ కోసం కూడా ఇప్పటికి అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానన్నారు. డివిజన్‌కు రూ. కోటి పనులు కూడా కొన్ని డివిజన్లో ప్రారంభమయ్యాయని, మరికొన్ని ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. అమృత్-2 పథకం కింద నగరంలో యూజీడీ పనులు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నగరంలో నూతనంగా 9 వాటర్ ట్యాంకుల నిర్మాణం జరుగుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నీటి ఎద్దడి లేకుండా పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అలాగే ఇందూరులోనే ఘన చరిత్ర ఉన్న అతి పురాతనమైన ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్‌వే కూడా రాబోతుందన్నారు. మేయర్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి, 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, 20వ డివిజన కార్పొరేటర్ న్యాలం సునీత, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోల్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అఫ్జల్ కుటుంబానికి అండగా ఉంటాం



అక్షరటుడే, బాన్సువాడ: మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన అఫ్జల్ ఖాన్ ఉపాధి కోసం రష్యా వెళ్లి, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మృతి చెందినట్లు సమాచారం రావడంతో ఆయన కుటుంబంలో తీవ్ర ఆందోళన నెలకొంది. అయితే అఫ్జల్ ఖాన్ మరణవార్తపై భారత ప్రభుత్వం నుంచి అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది. ఆయన ఆచూకీ, ప్రస్తుత పరిస్థితిపై స్పష్టత లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో అఫ్జల్ ఖాన్ కుటుంబానికి అండగా ఉంటామని ఆగ్రోస్ ఇండస్ట్రీస్ మాజీ చైర్మన్ కాసుల బాలరాజు భరోసా ఇచ్చారు. ఆయన ఆచూకీపై ఎంపీ సురేష్ షెట్కార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. భారత ఎంబసీ అధికారులతో సంప్రదించి అఫ్జల్ పరిస్థితిపై వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానని ఎంపీ తెలిపినట్లు బాలరాజు పేర్కొన్నారు.

లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



అక్షరటుడే, కోటగిరి : పోతంగల్ మండలం కొల్లూరు గ్రామంలో సర్పంచ్ జగన్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను మంగళవారం పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. రేషన్‌కార్డుల ద్వారా లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరవేయడంలో మరింత సులభం అవుతుందన్నారు. గ్రామంలో 199 రేషన్ కార్డులు వచ్చాయని పేర్కొన్నారు. ఉపసర్పంచ్ బండారి రవి, సెక్రెటరీ ఉమాకాంత్, సంపత్, శ్రీకాంత్, మాధవరావు, రమేష్, హన్మంత్ పాల్గొన్నారు.

జీపీ కార్యదర్శి నిర్బంధం.. అక్రమాలకు పాల్పడుతున్నాడని గ్రామస్తుల ఆరోపణ



అక్షరటుడే, కోటగిరి: అవినీతికి పాల్పడుతున్నాడని ఆరోపిస్తూ జీపీ కార్యదర్శిని గ్రామస్తులు నిర్బంధించారు. ఈ ఘటన పోతంగల్ మండలంలోని హంగర్గా గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామస్తులు మాట్లాడుతూ.. జీపీ తీర్మానాలను పట్టించుకోకుండా కార్యదర్శి కొందరి వద్ద డబ్బులు తీసుకుని ఇంటి నెంబర్లు కేటాయిస్తున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ.. పది నెలల జమాఖర్చుల విషయంలో గ్రామసభలో పొంతన లేకుండా ఖర్చులు చూపించారన్నారు. అడిగితే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నారన్నారు. రూ.5లక్షల వరకు గోల్‌మాల్ జరిగినట్లు తమకు అనుమానం ఉందన్నారు. ఇల్లు లేని వారికి, ఖాళీ స్థలాలు ఉన్నవారికి, పేరు మార్పిడి కోసం వస్తే వారి వద్ద డబ్బులు తీసుకుంటూ జీపీకి నష్టం చేకూర్చేవిధంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. మూడు నెలల నుండి సుమారు రూ.40వేల నుండి రూ.50వేల వరకు బ్యాంకులో జమల చేయకుండా వాడుకున్నాడని తీవ్ర ఆరోపణలు చేశారు. రసీదు పుస్తకంలో రసీదులను మధ్య, మధ్యలో చింపుతూ.. ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఉన్నతాధికారులు వచ్చి స్పష్టమైన హామీ ఇచ్చేంతవరకు అతన్ని వదిలేది లేదని గ్రామస్తులు జీపీకి తాళం వేసి పంచాయతీ ముందు బైఠాయించారు.







భక్తితో 'అమ్మ'ను కొలుస్తూ..

శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. నగరంలోని నాగారం 50 క్వార్టర్స్‌లో వీరాయూత్ మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏడాది దుర్గామాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వివిధ అవతారాల్లో అమ్మవార్లను ప్రతిష్ఠించి పూజలు చేస్తున్నారు. ఈ మండపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నిజామాబాద్









జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గాంధారి క్రీడాకారిణి



అక్షరటుడే, గాంధారి: ఒకేసారి రెండు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై ఓ క్రీడాకారిణి ఔరా అనిపించింది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలంలోని గుడి వెనక తండా నిరుపేద కుటుంబానికి చెందిన బానోత్ విఠల్, మంగాదీ బాయి కుమార్తె బానోత్ ఉష జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు అభ్యసించింది. కొయ్యగుట్ట జూనియర్ కాలేజీలో ఇంటర్ చదువుతున్న ఉష వేములవాడలో జరిగిన సబ్ జూనియర్ బాలికల కబడ్డీ పోటీలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించింది. ఉష ప్రదర్శనలు చూసిన అధికారులు ఆమెను జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక చేసినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ రాథోడ్ తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 9 నుంచి 12 వరకు ఖమ్మం జిల్లాలోని అశ్వరావుపేటలో జరిగిన జూనియర్ కబడ్డీ పోటీల్లో మరోసారి కామారెడ్డి నుండి ప్రాతినిధ్యం వహించిన ఉష ప్రదర్శన అద్భుతంగా ఉండటంతో ఆమెను జాతీయ స్థాయి జట్టుకి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఉషను కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు భాస్కర్ రెడ్డి, రాజన్న, కళాశాల ప్రిన్సిపల్ కమల భాయి పీడీ సరళ, జానకి అభినందించారు.



దుర్గాదేవి వద్ద మహా అన్నదాన కార్యక్రమం

అక్షరటుడే, గాంధారి: మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో దుర్గామాత ఐదో వార్షికోత్సవం సందర్భంగా దేవి శరన్నవరాత్రులను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. మంగళవారం అన్నపూర్ణ దేవి అవతారంలో అమ్మవారిని కొలుచుకుంటూ.. అన్నదానం నిర్వహించారు. 100కు పైగా స్వాములు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 1,500 నుంచి 2,000 మంది భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గాయూత్ సభ్యులు శ్రీకాంత్, కృష్ణ, ప్రశాంత్, ఆకాష్, పృథ్వీ, మాల ధరించిన స్వాములు పాల్గొన్నారు.

కేర్ డిగ్రీ కళాశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్: నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా నాల్గో రోజు నానబియ్యం బతుకమ్మ వేడుకలను కళాశాలలో నిర్వహించారు. బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. పువ్వులను ఒక దేవతగా భావించి పూజించి పండుగ చేయడం ఒక గొప్ప ఆధ్యాత్మిక భావన అని మహిళా అధ్యాపకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యాపకులు అనురాధ, సునితారాణి, మౌనిక, గంగమణి, శ్రీవిద్య, శ్రీలత అరుణ తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్ లయన్స్ భవనంలో కంటి వైద్యశిబిరం



అక్షరటుడే, బాల్కొండ: మండలంలోని కిసాన్ నగర్ గ్రామంలో లయన్స్ భవనంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ పుణ్యరాజు 30 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో కంటిశుక్లం (మోతిబిందు) ఉన్నవారిని గుర్తించి, శస్త్రచికిత్సల నిమిత్తం ఆర్మూర్ లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కంటి వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ నిజామాబాద్ రీజినల్ కార్యదర్శి చాకులింగం పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధానికి శ్రీకారం చుట్టిన మహిళలు



అక్షరటుడే, మాక్లూర్: గుంజిలి గ్రామానికి చెందిన ఆడపడుచులు ప్లాస్టికి వినియోగం నిషేధించాలని ముందుకొచ్చారు. అందులో భాగంగా నవరాత్రుల సందర్భంగా అమ్మవారి మండపాల వద్ద ప్లాస్టిక్ భోజన ప్లేట్లను నిషేధించాలని నిర్ణయించారు. గ్రామానికి చెందిన మహిళలు చేయిచేయి కలిపి స్టీల్ ప్లేట్లను కొనుగోలు చేయాలని సంకల్పించి రూ.36,000 సేకరించారు. ఈ డబ్బులో 400 ప్లేట్లను కొనుగోలు చేసి మంగళవారం స్థానిక సర్పంచ్ గోపి అధ్వర్యంలో నిర్వాహకులకు అందజేశారు. మహిళలు చూపిన ఈ స్ఫూర్తికి గ్రామస్తులు వారిని అభినందించారు.

రసాయనాలు ఉన్న డబ్బా పేలి మహిళ మృతి

అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నగరంలో విషాదం నెలకొంది. రసాయనాల ఉన్న డబ్బా పేలి మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మిర్చికాంపౌండ్‌లో ఉదయం రసాయనాలు ఉన్న ఓ డబ్బాను తీసుకెళ్తున్న మహిళ దానిని పగులగొట్టేందుకు ప్రయత్నించింది. అయితే అది ఒక్కసారిగా పేలడంతో మహిళ ముక్కలు ముక్కలైంది. భారీ శబ్దం రావడంలో ఉలిక్కిపడ్డ స్థానికులు వచ్చి చూసేసరికి మహిళ మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న 1వ టౌన్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతిచెందిన మహిళను పాత సామాన్లు సేకరించే మహిళగా పోలీసులు గుర్తించారు.

ఏటీఎం దోపిడీ ఎఫెక్ట్.. నలుగురు హోంగార్డుల సస్పెన్షన్



అక్షరటుడే, కామారెడ్డి/గాంధారి : గాంధారి మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన చోరీ ఘటన జిల్లా పోలీసు శాఖను కుదిపేసింది. ఈ కేసులో విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న కారణంతో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర సంబంధిత సిబ్బందిపై చర్యలకు ఆదేశించారు. ఈ ఘటనకు బాధ్యులుగా చేస్తూ.. ఏకంగా నలుగురు హోంగార్డులను సస్పెండ్ చేయడంతో పాటు, సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్సై, ఏఆర్సీసీలకు ఛార్జిమెమోలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ కేసులో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఏటీఎం చోరీకి పాల్పడిన దొంగలు ఎక్కడి నుంచి వచ్చారు.. చోరీ తర్వాత ఎక్కడికి వెళ్లారనే దానిపై ప్రత్యేక బృందాలు విచారణ జరుపుతున్నాయి. కమర్షియల్ ఏరియాగా పేరున్న గాంధారిలోని ఎస్‌బీఐ ఏటీఎంలో భారీగా చోరీ జరగడం కలకలం రేపింది. ఏకంగా రూ. 25 లక్షల వరకు చోరీ జరిగినట్లు భావిస్తుండడంతో జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర వీలైనంత త్వరగా నిందితులను పట్టుకోవాలని పట్టుదలతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సీసీ కెమెరాల ఆధారంగా ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చిన పోలీసులు ఆ దిశగా విచారణను ముమ్మరం చేసినట్లు సమాచారం. ఫలితంగా విధుల్లో నిర్లక్ష్యం వహించారన్న కారణంతో పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. రాత్రి పూట పెట్రోలింగ్ చేస్తూ ఆపరేషన్ కవచ్ విధుల్లో ఉండి కూడా ముగ్గురు దొంగలు స్కార్పియో వాహనంలో పోలీసుల కళ్లుగప్పి నిమిషాల వ్యవధిలో భారీ చోరీకి పాల్పడడం చర్చనీయాంశంగా మారింది.

ఆర్మూర్ కోర్టులో ఉచిత హెల్త్ క్యాంప్



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని కోర్టు ఆవరణలో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జడ్జి శ్రీదేవి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. మండల్ లీగల్ సర్వీస్ అర్మూర్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఉచిత హెల్త్ క్యాంప్‌లో న్యాయవాదులతో పాటు ఇతరులకు సైతం ఉచితంగా వైద్య పరీక్ష నిర్వహించి మందులు అందజేశారు. ఉచిత హెల్త్ క్యాంప్‌లను ప్రజలు వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కాందేశ్ శ్రీనివాస్, జక్కుల శ్రీధర్, చిలుక కిష్టయ్య, జెస్సు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కట్లపాము కాటుకు గురైన బాలుడికి జీజీహెచ్‌లో అరుదైన చికిత్స



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కట్లపాము కాటుకు గురైన తొమ్మిదేళ్ల బాలుడికి జీజీహెచ్ లో అరుదైన చికిత్స నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ మంగళవారం వివరాలు వెల్లడించారు. అక్టోబర్ 6వ తేదీన తెల్లవారుజామున బాలుడు ఇంట్లో కట్లపాము కాటుకు గురయ్యాడు. దీంతో నరాల బలహీనత (న్యూరోటాక్సిసిటీ), కనురెప్పలు వాలిపోయే (ప్టోసిస్) లక్షణాలతో జీజీహెచ్‌లో చేరాడు. ఆస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే శ్వాస తీసుకోవడం కష్టంగా మారడంతో, పరిస్థితి విషమించకుండా వైద్య బృందం తక్షణమే స్పందించింది. చిన్నారికి అత్యవసరంగా 20 యాంటీ స్నేక్ వెనమ్ డోసులతో పాటు అట్రోపిన్, నియోస్టిగ్మైన్ మందులను అందించారు. శ్వాసక్రియను మెరుగుపర్చేందుకు వెంటనే మెకానికల్ వెంటిలేషన్‌పై ఉంచి వైద్యులు నిరంతరం పర్యవేక్షించారు. అన్ని రకాల సంప్రదాయ, సమగ్ర వైద్య విధానాలను అందించడంతో, చికిత్సకు చిన్నారి శరీరం సానుకూలంగా స్పందించింది. ఆస్పత్రిలో చేరిన మూడో రోజున చిన్నారికి స్పృహ రాగా, నాలుగో రోజున వెంటిలేటర్ సపోర్టును విజయవంతంగా తొలగించారు. ప్రస్తుతం చిన్నారి కోలుకున్నాడని తెలిపారు.